
కథ



కలశపూడి శ్రీనివాసరావు

# ఆటో మీటర్, ఆటో మేటిక్

మహానగరంలో బస్టాప్ మధ్యతరగతి ఆశలా చెల్లాచెదురుగా నిలబడివున్న మనుషులతో విశాలంగా పరుచుకుని ఉంది. రాని, వచ్చినా ఆగని, ఆగినా ఎక్కడానికి వీలులేని బస్సులని అరగంట నుండి నిలబడి చూస్తున్నాడు. విశ్వం కోపం క్షణక్షణానికి పెరిగిపోతోంది. బస్సులమీదకంటే, అక్కడక్కడే తిరుగుతున్న ఆటోల వాళ్ళ మీద. అటుఇటు కదులుతున్న ఆటోవాళ్ళు విశ్వంలాంటి వాళ్ళని "ఆటో తీసుకుందామా? వద్దా?" అని ఊగిసలాడిస్తున్నాయి.

విశ్వం మెల్లగా నడచి ఓ ఆటో దగ్గరకు వెళ్ళి నిలబడ్డాడు.

'వస్తావా?' అని అడగకముందే ఆటో డ్రయివరు "మీటర్ మీద ఎగస్ట్రా 10" అన్నాడు. ఇక బేరాలు లేవన్న విషయం స్పష్టం చేస్తూ.

"మీటర్ మీద ఎందుక రావు?" అన్నాడు విశ్వం కోపాన్ని అణచుకుంటూ.

"మీటరేస్తా, దానిమీదే 10 అన్నానుగా" అన్నాడు ఆటో డ్రయివరు విసుగు దాచుకోకుండా. అప్పటికే పదిసార్లు లెక్క పెట్టుకున్నాడు విశ్వం. తార్నాకకు బస్సుమీద వెళితే 3 రూపాయలు టిక్కెట్టు. ఆటో మీటరుమీద మీటరు ప్రకారం 15 రూపాయలు. అదే బస్సుకంటే ఐదురెట్లు ఎక్కువ. టాక్సీలో వెళితే ఏ 200 రూపాయలో అవుతుంది. రైల్వేస్టేషన్ నుండి ప్రీ పెయిడ్ టాక్సీ అయితే 140 రూపాయలు అవుతుంది. ఇంటి దగ్గర దిగిన తరువాత టాక్సీ డ్రయివరుకి కనీసం పది రూపాయలైనా ఇవ్వకపోతే ఏంబావుంటుంది. కానీ సరిగ్గా ఆ పది రూపాయలు ఆటో డ్రయివరు మీటరుమీద ఎక్కువ ఇవ్వమని అడి గేసరికి కష్టం అనిపిస్తుంది. పదోసారి గుర్తుతెచ్చుకోబడ్డాయి తన పర్సులో ఉన్న రెండు పది రూపాయల నోట్లు. విశ్వం కోపం విశ్వాన్ని ఆక్రమించి కాళ్ళను వెనక్కి తిప్పింది. కానీ కోపంఆపుకోలేక తల ఆటోవాడివైపు తిప్పి, "మీటరుమీదే తీసుకెళ్ళాలని తెలీదా నీకు?" అన్నాడు. అక్కడ చుట్టూ ఉన్న అందరికి ఆటోవాడిని అదే ప్రశ్న అడగాలని ఉన్నా, విశ్వానికి మద్దతుగా ఏమాత్రం కనిపించినా విశ్వం 'లీడర్' అయిపోతాడేమో, తగినంత దూరం జరుగుతున్నారు ప్రయత్న పూర్వకంగా.

"తెల్సుసార్, తెల్సు. నాలుగురోజులు స్ట్రైక్. పూరా ఖాళీ. భర్తీ చెయ్యాల్నా వద్దా? మీటర్‌కే ఊపర్ దస్. బస్" అని అందరి వైపు ఒకసారి చూసి, ఇక్కడున్న వాళ్ళు ఎవ్వరు రారని నిశ్చయించుకోని 'ఇవ్వగల' వారికోసం మరింత ముందుకి వెళ్లాడు.

ఇంతదాకా దాచుకున్న కోపాన్ని బయటపెట్టడానికి విశ్వానికి అవకాశం వచ్చినట్లు భావించి చుట్టూ ఉండి, తనలాంటి పరిస్థితిలోనే ఉండి కూడా మాట సహాయమైనా చేయని వాళ్ళని తిట్టలేక, తిట్టినా వినిపించనంత దూరం వెళ్ళిపోయిన ఆటోవాడిని గట్టిగానే తిట్టడం మొదలుపెట్టాడు.

"ఈ ఆటోవాళ్ళకి బుద్ధిలేదు. ఎంత దొరికితే అంత దోచేద్దామనే. ఓ రూలు పాటిద్దామని అస్సలు ఆలోచన లేదు. ఖాళీగా పోతారు కాని మీరుమీద రారు. బుద్ధిలేని వాళ్ళు" అని మరోసారి అన్నాడు. ఇలా రకరకాల మాటల్లో, రకరకాల వాక్యాలలో, ఆగిఆగి అదే అర్థం వచ్చేట్టు పదేపదే అంటున్నాడు.

చుట్టూ ఉన్నవాళ్లు వినీ విననట్టు మొహంపెట్టి అంతా వింటున్నారు. మాటలు అంటూనే మిగిలిన వాళ్ళంతా వింటున్నట్టు గమనిస్తున్నాడు విశ్వం. అలాంటప్పుడే చెల్లాచెదురుగా ఉన్నవాళ్ళ మధ్య నుండి పంచెకట్టుతో, పండు జుట్టుతో, పదార్ల వయసు దాటినా సడలని వంటి దారుఢ్యంతో సాయంకాలం ఆహ్లాదంగా వాహ్యాళికి వెళ్ళే తీరున ఒక వ్యక్తి విశ్వం దగ్గరగా వచ్చి "వీళ్ళను ఎవ్వరు ఏమీ చేయరు. వీళ్ళు వాగుపడరు అని అంటున్నారు, ఎవరో ఎందుకు చెయ్యాలి, మీరే ఎందుకు ఆ పనికి పూనుకోకూడదు?" అని సూటిగా స్నేహపూర్వకంగా నవ్వుతూ అడిగాడు.

"నేనా? వీళ్ళనా? నేనేం రాజకీయ నాయకుడిని కాదు. లీడర్ని కాదు. పోలీసాఫీ సర్ని కాదు." అన్నాడు పరిసరాలని మరిచిపోయి. సూటిగా, సూదుల్లా సూర్య కిరణాలు కళ్ళల్లో పడ్డప్పుడు రెండు చేతులు అడ్డంపెట్టి కళ్ళు మూసుకుంటున్న కుర్రాడిలా.

"మీరేం చేస్తుంటారు?"

"నేను డిగ్రీ కాలేజిలో లెక్చరర్ని" అన్నాడు విశ్వం.

"ఏం పాఠాలు చెప్తారు?"

"స్టేటస్టిక్సు"

"ఓహో... అలాగా"

ఇంతలో బస్సు వచ్చింది. "రండి" అని విశ్వంతో అని ఆయన పరుగులాంటి నడకతో బస్సువైపు కదిలారు. విశ్వం కూడా ఆయన వెనకే వెళ్ళి బస్సు ఎక్కాడు. బస్సు కదిలింది.

** ** **

"చూడండి, ఏదైనా చెయ్యాలనుకుంటే మీరే చెయ్యాలి. వాళ్ళని వీళ్లని తిట్టుకుంటే ప్రయోజనం లేదు. మీకున్న చదువు, అవకాశాలు ఆ ఆటోవాళ్ళకి లేవు కదా!" అంత రద్దీగా ఉన్న బస్సులో రొదలో తాపీగా, గట్టిగా విశ్వం చెవికి దగ్గరగా ఆయన మాట్లాడుతున్నాడు.

"కానీ ఈ ఆటోవాళ్ళని మీటర్ మీద నడిపించగల అధికారం, బలగం ఉన్న పోలీసువాళ్ళే ఈ పని చెయ్యలేకపోతే నాలాంటి సామాన్యుడు ఏం చెయ్యగలడండి?" అన్నాడు విశ్వం.

"కనీసం ఏం చెయ్యగలరని ఆలోచన చెయ్యగలరు కదా?"

"అంటే..."

"ఆటో వాళ్లు మీటర్ మీదే ప్రయాణీకులని తీసుకువెళ్ళడం వల్ల వాళ్లకే మంచిదని వాళ్లకి అర్థం అవ్వాలంటే ఏంచేయాలి అని ఆలోచించండి!"

ఏదో స్టాప్ వచ్చింది. బస్సు ఆగింది. మళ్ళీ ఎక్కేవాళ్ళు దిగేవాళ్ళు. వాళ్ళ కదలికలో విశ్వం ఆయనకుదూరం అయిపోయాడు.

బస్సు కదిలింది. కళ్ళతోనే ఒకళ్లనొకళ్ళు చూసుకొన్నారు. ఈ వయస్సులో కూడా ఈయన బస్సులో చక్కగా ప్రయాణం చేస్తున్నారు. గొప్ప అని అనుకున్నాడు బస్సుల్లో ఈ రద్దీ భరించలేక వీలయిన ప్పుడల్లా ఆటోలోనే ప్రయాణంచేసే విశ్వం. ఆలోచించమని ఆయన ఇచ్చిన ఆలోచనకు మరింత ఆశ్చర్యపడ్డాడు.

విశ్వం ఓ డిగ్రీ కాలేజిలో స్టాటస్టిక్స్ (గణాంక శాస్త్రం) బోధించే లెక్చరర్. అతనికి ఉన్న అనుభవం అంతా ఆ పాఠాలు చెప్పడమే. చదువుకొన్న రోజులలో కాని ఇప్పుడుకానీ చదువు తప్ప మరే విషయాలలో పాల్గొన్నవాడు కాదు. లీడర్ అసలు కానే కాదు. తన చదువు, తన ఉద్యోగం, తన సంసారం. అంతే. సమాజంలో మిగిలిన విషయాల గురించి కానీ రోజూ ఆలోచించడు. సాయంత్రం భార్యని పిల్లల్ని ఇంటి దగ్గర ఉన్న 'ఆరాధన' హాలులో సినిమాకి తీసుకువెళతానని చెప్పాడు ఉదయం. ఊర్లో పని పూర్తి అయ్యేసరికి ఐదు దాటిపోయింది. లేటు అయిపోతోంది. తొందరగా ఇల్లు చేరుకోవాలి అన్న ఉద్దేశంతో ఆటో గురించి ఆలోచించాడు. బస్సు మరో రెండు స్టాపులలో ఆగి బయలుదేరింది. ఈలోగా తాపీగా విశ్వం దగ్గరకు చేరు కుని ఆయన,

"నేను మరో రెండు స్టాపుల తరవాత దిగాలి" అన్నాడు.

"అలాగా, నేను మీకంటే ఓ స్టాపు ముందే దిగాలి" అన్నాడు విశ్వం.

"సరే అయితే నేను మీతోపాటే దిగి, మనం మాట్లాడడం మొదలుపెట్టిన విషయం మాట్లాడటం పూర్తిచేసి, ఆ తరవాత నడిచి మాయింటికి వెళతాను మీకు సమ్మతమేనా?"

"ఏదో మాటవరసకి అన్నారనుకున్నాను కానీ..."

"బాగా చదువుకున్న వాళ్ళు, నలుగురికి చదువు చెప్పే మీలాంటివాళ్ళు ఏదో ఓ సమస్యని తీసుకుని, చక్కగా ఆలోచించి, ప్రజలకి ఓ పరిష్కార మార్గం చూపించాలి. అటువంటి మీరే 'నేను సామాన్యుణ్ణి' అని ఏమీ చెయ్యకుండా ఉంటే మిగిలినవాళ్ళు ఏం చెయ్యగలరు? బతుకు గాడిలో బండగా, జడంగా జీవితం గడిపేయడం తప్పించి" అన్నాడు మెల్లిగా బోధపరుస్తున్న తీరులో.

"అలాగే దిగుదాం" అన్నాడు విశ్వం.

మరికొద్దిసేపటికి విశ్వం దిగవలసిన స్టాప్‌లో ఇద్దరు దిగారు. బస్సు దుమ్ము రేపుకుంటూ వెళ్ళిపోయింది.

"ఇప్పుడు చెప్పండి. ఇంత చదువు చదివిన మీకు ఆలోచించవలసిన బాధ్యత ఉందా? లేదా?" అని అడిగాడు.

'ఉంది' అన్నట్లు బుర్ర ఊపాడు విశ్వం.

"మరైతే మీ కళ్ళముందున్న, ఈ ఆటో మీటర్ ప్రకారం నడపబడని విషయం మీకు మీలా వేలాదిమందికి రోజూ ఉన్న సమస్య కదా. మరి దానికి తగిన పరిష్కారానికి ఆలోచించండి."

"మీరు చెప్తుంటే నిజమే ఏదో ఒకటి చెయ్యాలని ఉంది. ఆలోచిస్తాను" అన్నాడు విశ్వం వినయంగా.

"మీకు స్టాటస్టిక్సులో ఉన్న ప్రావీణ్యం ఉపయోగించి ఈ సమస్యకు పరిష్కారం చూపించగలరని నాకు నమ్మకం ఉంది. మరి నేను వెళతాను"

"మా ఇల్లు ఇక్కడే దగ్గరలోనే. వచ్చి కాఫీ తీసుకుని వెళ్ళండి" అని కోరాడు విశ్వం.

"అబ్బే, ఎందుకు శ్రమ. మరోసారి కలుద్దాం" అన్నారు నవ్వుతూ ముందుకు

నడుస్తూ. "అలాగే" అన్నాడు కలలో ఉన్న వాడిలా తన ఇంటివైపు తిరుగుతూ.

** ** **

"రోజుకి దాదాపు 200 రూపాయల ఆదాయంతో, సుమారు 50,000 ఆటోలు తిరుగుతున్న ఈ నగరంలో ఈ వ్యాపారం రోజుకి కోటి రూపాయలు దాటిన వ్యవహారం" అన్న లెక్చరర్ విశ్వం మాటలకి, "ఎవడో ఒక లెక్చరర్ వస్తాడు, ఏదో ఒక పాఠం పాడుకొని పోతాడు" అన్న భావంతో సాధారణంగా అల్లరిచేస్తూ, శ్రద్ధ చూపని బికాం ఫైనలియర్ క్లాస్‌లో ఉన్న 24మంది అబ్బాయిలు, 16మంది అమ్మాయిలు ఒక్కసారి ఆశ్చర్యపోయి, నిశ్శబ్దంగా, శ్రద్ధతో లెక్చరర్ విశ్వం మాటలు వినడం మొదలుపెట్టారు.

"సుమారు రోజుకు కోటి రూపాయలు దాటిన ఆటో వ్యాపారంలో కష్టించేవాడికి, కష్టమర్‌కి మధ్య ఉన్న అతి ముఖ్యమైన పాత్ర పోషించవలసినది 'ఆటోమీటర్'. అటువంటి 'ఆటోమీటర్'వేసి ఆటో నడిపి, దాని ప్రకారం డబ్బులు తీసుకోవడం వల్ల ఆటో డ్రయివర్లకి లాభమా? నష్టమా? మీరు నేర్చుకున్న ఎకౌంటింగ్, స్టేట స్టిక్స్ ఉపయోగించి ఈ ప్రశ్నకి సమాధానం ఇవ్వగలరా?" అని ఆగిన లెక్చరర్ విశ్వం ప్రశ్నకి క్లాస్ అంతా మరింత ఆశ్చర్యపోయి, మాట రాక నిశ్శబ్దంతో లెక్చరర్ విశ్వం మొహం చూస్తూ ఉండిపోయారు.

అప్పుడే మొదలైన వర్షం జల్లులు కిటికీకి ఆనుకుని ఉన్న చెట్టు ఆకులపై చేస్తున్న సవ్వడి స్పష్టంగా వినిపిస్తోంది క్లాసులో ఉన్న అందరికి.

మీరు ఈ విషయాన్ని ఓ ప్రాజెక్టుగా తీసుకొని పనిచెయ్యాలని నా ఉద్దేశం. ఎంతమందికి ఈ ప్రాజెక్టు చెయ్యాలని ఉందో చేతులెత్తండి అన్నాడు లెక్చరర్ విశ్వం. ఆశ్చర్యం నుండి తేరుకుంటూ విద్యార్థులు చేతులెత్తారు.

"నేను చేస్తాను సార్", "నేను చేస్తాను సార్" అని అంటున్న 40మంది మాటలతో ఆ క్లాసు అంతా నిండిపోయింది.

బయట వర్షం పెరుగుతూ చేస్తున్న చప్పుడు ఇప్పుడు క్లాసులో వినపడడంలేదు. ఊహించనటువంటి ఉత్సాహం చూపుతున్న క్లాస్‌ని చూస్తూ లెక్చరర్ విశ్వం, తాము చదివిన చదువు మార్కుల కోసమే కాకుండా ఇటువంటి విషయాలకు కూడా ఉపయోగపెట్టేలాంటి లెక్చరర్‌ని ఆనందం, ఆశ్చర్య సంభ్రమంతో చూస్తూ క్లాసు కొద్ది క్షణాలు తమని తాము మరచిపోయారు.

తేరుకొని ఆ పని ఎలా చెయ్యాలి అన్న విషయంలో మునిగిపోయారు. ఒక్కొక్క టీమ్‌లో ఇద్దరేసి చొప్పున 20 టీములు ఏర్పాటుచేసారు. ఒక నెలరోజులలో ప్రతీ టీమ్ 60మంది ఆటో డ్రయివర్లతో మాట్లాడి మొత్తం 1200 మంది ఆటో డ్రయివర్లని ఒకనెలరోజులపాటు ఈ ప్రాజెక్టులో పాల్గొనడానికి వప్పించాలి. అందులో 600 మందిని మీటరు వేసి మాత్రమే నడపమని, మిగిలిన 600 మందిని మీటరుతోకాక మీటరు మీద ఇంత ఎక్కువ అని కాని లేదా వారికి తోచినట్లు బేరాలాడి కాని ఆటో ఒక నెలరోజులపాటు నడపాలని కోరాలి. ఎవరు ఎలా నడిపినా వాళ్ల ఆటో ఎన్ని మైళ్ళు నడిపింది, ఎంత పెట్రోల్ ఆటోలో వేయించింది, ఎన్ని బేరాలు ఎక్కించుకున్నది, ఏపే బేరంలో ఎంత వచ్చింది, ఎన్ని గంటలు పని చేసింది వంటి వివరాలు ప్రతీరోజు విధిగా ప్రతి టీము, తమ టీములో ఉన్న 60మంది వివరాలు సేకరించాలి. అప్పుడప్పుడు తమతమ టీముల్లో ఉన్న ఆటోడ్రయివర్లు ఎవరెవరు ఎంత నిజాయితీగా ఈ ప్రాజెక్టు నియమాలని పాటిస్తున్నారో ప్రతీ టీమువారి స్నేహితులు, బంధువుల సహాయంతో పరీక్షించుకోవాలి. ప్రోజెక్టు నియమాలని పాటించని ఆటో డ్రయివర్లని గుర్తించాలి.

** ** **

ఒక వారంరోజులలో ఏపే టీమ్ ఏపే జంక్షన్లలో పనిచేయాలన్నది నిశ్చయించుకొన్నారు. సేకరించవలసిన విషయాల జాబితా క్షుణ్ణంగా క్లాసులో చర్చించి మరీ నిశ్చయించారు. పదిహేనేళ్ళుగా చదువుతున్న ఆ విద్యార్థులు అంత శ్రద్ధగా చేపట్టిన విషయం ఇదే అంటే ఆశ్చ ర్యపడనక్కరలేని విధంగా ఈ ప్రోజెక్టు మీద శ్రద్ధ చూపిస్తున్నారు. పదిహేనేళ్ళుగా పాఠాలు చెప్తున్నా, గురువుగా విద్యార్థుల గౌరవం పొందింది ఇప్పుడే అని అనిపించింది లెక్చరర్ విశ్వానికి.

**మీటరు మీదేకదా అని ప్రయాణీకులు తక్కువ దూరాలకి కూడా ఆటో వాడడం ఎక్కువ చేసారని, అలా చేయడం వల్ల, తక్కువ దూరాలు తిరగడం వల్ల ఖాళీగా వెనక్కి రావడం బాగా తగ్గి, ఆదాయం పెరగడానికి తోడ్పడిందని, ఏవిధంగా చూసినా బేరాలాడే ఆటో డ్రయివర్ల ఆదాయం రకరకాల కారణాలవల్ల కూడా తక్కువగానే ఉంది**

ప్రిన్సిపాల్‌ని వప్పించడానికి, ఈ ప్రాజెక్టుకు కావలసిన వివరాలు, కాగితాలు సేకరించడానికి ఓవారం రోజులు పట్టింది. ఆ తరువాత నగరంలో ఉన్న నాలుగు పెద్ద ఆటో యూనియన్ల లీడర్లని లెక్చరర్ విశ్వం తోపాటు 40మంది విద్యార్థులు రెండుమూడు తడవలు కలిసి ఈ ప్రోజెక్టు వివరించి, వారిని వప్పించడానికి మరో మూడువారాలు పట్టింది. ఆగస్టు పదిహేను నుండి ఈ ప్రాజెక్టు కార్యరూపంలోకి వచ్చింది.

ఈ ప్రాజెక్టులో పాల్గొన్న ఆటోడ్రయివర్లని ప్రతీరోజు కలిసి సేకరించవలసిన వివరాలన్నీ సేకరించడం మొదలుపెట్టారు విద్యార్థులు. ఆ వివరాలతోపాటు ఆటో డ్రయివర్ల వ్యక్తిగత వివరాలు కూడా తాపీగా తెలియసాగాయి విద్యార్థులకు. వాళ్లలో కొద్దిమంది డిగ్రీలు ఉన్నవాళ్ళు ఉన్నారని, చాలామందికి అవకాశాలు లేక పై చదువులకు వెళ్ళలేకపోయారని, కానీ చాలామంది తమంత కానీ తమకంటే తెలివైనవారే అని తెలుసుకున్నారు. కొద్దిమందిలో, పెద్దపెద్ద చదువులు చదివిన వాళ్లలో కూడా కనిపించని మానవత్వాన్ని చూసి ఆశ్చర్యపోయారు. వాళ్ల వేసే వేషాలు, డబ్బుకోసం చేసే మోసాలు అన్ని తరగతుల వాళ్ళు చేసేలాంటివే అని తెలుసుకున్నారు. కొద్దిమంది డ్రయివర్లతో విద్యార్థులకు మంచి పరిచయాలే ఏర్పడ్డాయి. ఆటో డ్రయివర్ల మీద చాలామందికి లాగే వీళ్ళకీ మొదటిలో ఉండే అపోహలు తొలగిపోయాయి. నెలరోజులలో కావలసిన వివరాలన్నీ జాగ్రత్తగా, పద్ధతి ప్రకారం తీసుకున్నారు. పరిశోధనలో అన్నివిధాలా ప్రాజెక్టు నియమాలను అన్నింటిని పాటించినవాళ్లు కనీసం 1000 మంది ఉండాలని, నియమాలని పాటించనివాళ్ళు కొంతమందైనా ఉంటారని ముందుగా ఎక్కువమందిని తీసుకున్నారు. ప్రాజెక్టు నియమాలని సరిగ్గా పాటించనివాళ్ల వివరాలని పరిశోధనలో చేర్చలేదు. అలా తీసివేయగా మిగిలిన 520 మంది మీటరు మీద నడిపిన వాళ్లని, 516 మీటరు ప్రకారం కాకుండా నడిపినవాళ్ళు తీసుకున్న వివరాలన్నింటిని వివిధ ఎకౌంటింగ్, స్టాటస్టిక్స్ పద్ధతుల్లో క్షుణ్ణంగా పరిశీలించారు. ముందు వేసుకున్న ప్రశ్నలకి వచ్చిన సమాధానాలని వివిధ కోణాలనుండి పరిశీలించారు. యూనివర్సిటీలో ఉన్న ముగ్గురు ప్రొఫెసర్లకు ఈ ప్రాజెక్టుని క్షుణ్ణంగా వివరించారు. వాళ్ళ సహాయంతో ప్రాజెక్టు ఉద్దేశాలని, పద్ధతులని, ఫలితాలని ఇస్తూ, వివరిస్తూ, చర్చించి ఓ చక్కనైన పరిశోధనా పత్రం రాసారు. దానిని భారతదేశంలో ఆ పరిశోధనారంగంలో పేరున్న 'సాంఖ్య' పత్రికకు పంపారు.

** ** **

నెల రోజులలో జవాబు వచ్చింది. దాని సారాంశం ఏమిటంటే, ఇటువంటి సామాజిక ప్రయోజనం ఉన్న పరిశోధన చాలా మెచ్చదగ్గదని, దీనిని వారి మాసపత్రికలో ప్రచురించడం ద్వారా మరిన్ని ఇటువంటి పరిశోధనలు జరిగే అవకాశం ఉందని, డిగ్రీ కాలేజీ లెక్చరర్ ఆధ్వర్యంలో డిగ్రీ విద్యార్థులు ఇంత చక్కనైన పరిశోధన జరిగిందంటే ఆశ్చర్యంగా ఉందని పొగుడుతూ కూడా రాసారు. ఈ పరిశోధన సామాజిక ప్రయోజనం దృష్ట్యాకొద్ది సాంకేతిక మార్పులతో వెంటనే డిసెంబరు నెలలో రానున్న వారి మాసపత్రికలో ప్రచురించడానికి సంపాదక వర్గం నిశ్చయించిందని తెలుపుతున్నందుకు సంతోషిస్తున్నామని రాసారు.

విశ్వం ఆ ఉత్తరాన్ని ముందు సంప్రదించిన యూనివర్సిటీలో ఉన్న ముగ్గురు ప్రొఫెసర్లకు తీసుకువెళ్ళి చూపించాడు. వాళ్లు కూడా మరోసారి అభినందించారు. పత్రికల వాళ్లని పిలిపించారు. విశ్వంఆధ్వర్యంలో డిగ్రీ విద్యార్థులు, విద్యార్థినులు చేసిన పరిశోధన ఫలితాలని అందరికి అర్థం అయ్యేలా వివరించారు.

** ** **

'మీటర్‌పై నడిపే ఆటోడ్రయివర్లే ఎక్కువ సంపాదిస్తున్నారు' అన్న శీర్షికతో మర్నాడు అన్ని వార్తాపత్రికలు మొదటి పేజీలోనే పెద్ద అక్షరాలతో ప్రచురించాయి. నగరంలో జరిగిన పరిశోధన గురించి వివరంగా రాసాయి. మీటరుమీద మాత్రమే ఆటో నడిపే డ్రయివర్లు, బేరాలాడే వారికంటే 50 శాతం ఎక్కువ సంపాదిస్తున్నారని, 60 శాతం తక్కువ శ్రమ పడుతున్నారన్నది ముఖ్యమైన విషయంగా గణాంక లెక్కలవల్ల తేలిందని రాసాయి. మీటరు మీదేకదా అని ప్రయాణీకులు తక్కువ దూరాలకి కూడా ఆటో వాడడం ఎక్కువ చేసారని, అలా చేయడం వల్ల తక్కువ దూరాలు తిరగడం వల్ల ఖాళీగా వెనక్కి రావడం బాగా తగ్గి, ఆదాయం పెరగడానికి తోడ్పడిందని, ఏవిధంగా చూసినా బేరాలాడే ఆటో డ్రయివర్ల ఆదాయం రకరకాల కారణాలవల్ల కూడా తక్కువగానే ఉందని, ఈ బేధాలు గణాంక శాస్త్ర లెక్కల ప్రకారం గణనీయమైనవని ఋజువైందని, ఈ పరిశోధన శాస్త్రీయంగా చేసింది కాబట్టి ఈ రంగంలో పరిశోధనలని ప్రచురించే శాస్త్రీయ పత్రిక ప్రచురణ వల్ల దేశవ్యాప్తంగా నగరంలో జరిగిన ఈ పరిశోధనకి గుర్తింపు కూడా వచ్చిందని రాసాయి.

పరిశోధనలో పాల్గొన్న 1000 పైబడ్డ ఆటోడ్రయివర్ల నోటిమాటతో అప్పటికే నగరంలో నలుమూలల మీటర్ మీద తిరిగే ఆటోల సంఖ్య బాగా పెరిగింది. వార్తాపత్రికలలో ఈ పరిశోధన రావడం వల్ల నగరంలో మీటర్ మీద మాత్రమే వచ్చే ఆటోల సంఖ్య చాలా ఎక్కువైంది.

ఆటో మీటర్ మీద రావడం ఆటోమేటిక్‌గా జరగడం నగరంలో అన్ని వర్గాల వారిని ఆశ్చర్యపరిచింది. ముఖ్యంగా పోలీస్ వర్గాన్ని ఆలోచింపజేసింది. డజన్ల కొద్ది పోలీసులని పెట్టి, చలానలుకట్టించి, నానా తిప్పలు పడ్డా నిజమైన మార్పు ఎప్పుడూ రాలేదు. అలాంటిది ఇప్పుడు పైసా ఖర్చు లేకుండా ఇంత పెద్ద మార్పు సులభంగా రావడమంటే పోలీసువారి పనితీరులోనే ఏదో లోపం ఉందని వారికి, ఆలోచించిన వారందరికి తోచింది.

డిగ్రీ కూడా పూర్తికాని వాళ్ళతోనే ఇంత చక్కనైన, ఉపయోగకరమైన పరిశోధన చేయించగలిగితే, పరిశోధనలకై లక్షలు ఖర్చు పెడుతూ పిహెచ్‌డి డిగ్రీలవాళ్ళని తయారు చేస్తున్న యూనివర్సిటీలు మరెంత ఎక్కువ ప్రజలకి ఉపయోగకరమైన పరిశోధన చెయ్యగలవో కదా! అనిపించింది అందరికి.

ఈ పరిశోధన అంతటికి ముఖ్యమైన వ్యక్తి అయిన విశ్వంకి మాత్రం మామూలు స్టాటస్టిక్స్ లెక్చరర్ అయిన తనని ఇటువంటి పరిశోధనకు పురికొల్పిన ఆ వ్యక్తి మళ్ళీ కనిపించలేదు. అతను ఎవరు? మళ్ళీ ఎప్పుడు కనిపిస్తాడు? కనిపిస్తే మనకున్న మిగిలిన సమస్యలన్నింటికీ కూడా ఆటోమేటిక్‌గా పరిష్కారం దొరికే మార్గం చూపించగలడా? అతడు మనలోని వ్యక్తా? విశ్వం ఆలోచనలలో మునిగిపోయాడు. ప్రేరేపించేది ఎవరైనా, ప్రేరణ ఇచ్చేది ఏదైనా పనిచెయ్యవలసినది మనమే అన్న పాఠం బోధపడిన విద్యార్థిలా విశ్వం ముఖం ఆనందంతో వెలిగింది.